
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025



పుప్పాలవాగు పనులు షురూ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెదక్ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలకు కొట్టుకుపోయిన పుప్పాలవాగు వంతెన పరిసరాల మరమ్మతులు ప్రారంభమయ్యాయి. రాకపోకలు నిలిచిపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. స్పందించిన అధికారులు బుధవారం మరమ్మతులు ప్రారంభించారు. దీంతో మక్తా భూపతిపూర్, తిమ్మనగర్, మల్కాపూర్, గుట్టకిందపల్లి, శివాయిపల్లి, వెంకటాపూర్‌తో పాటు రెండు తండాల ప్రజల రాకపోకల ఇబ్బందులు తప్పనున్నాయి.

విద్యార్థుల వసతి ఏర్పాటుకు చర్యలు



కొనసాగుతున్న తాత్కాలిక రేకుల షెడ్ల పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మునిపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని లింగంపల్లి గురుకుల హాస్టల్ భవనం కూలడంతో విద్యార్థులకు వసతి లేకుండాపోయింది. తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించినా కిందిస్థాయి అధికారుల పట్టించుకోలేదు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై గత నెల 24న 'విద్యార్థులకు వసతి ఎక్కడ..!' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఎట్టకేలకు గురుకుల పాఠశాల ఆవరణలోని నూతన భవనంపై రేకులు షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు నత్తనడక సాగుతున్నాయి. దసరా సెలవులు ముగుస్తున్నందున పనులను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అమ్మో.. పాము..!

ఈ ఏడాది ఇప్పటికే 67మందికి కాటు

వానాకాలం సీజన్‌లోనే 41 మందికి..

మంత్రాల జోలికి వెళ్లొద్దు

చికిత్స అందిస్తేనే ప్రాణాలకు భరోసా

మెదక్ పట్టణానికి సమీపంలోని చిట్యాలకు చెందిన ఓ రైతు పొలంలో చెరుకు గెడలు నరుకుతుండగా.. పాము కాటు వేసింది. మొదట చిన్నగానే అనిపించినా కాసేపటికి వాపు పెరిగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించడంతో ప్రాణం దక్కింది.

రేగోడ్ మండలంలో ఓ గృహిణి రాత్రివేళ వంటగదిలో బియ్యం సంచి తీయడానికి వెళ్తుండగా పాము కాటు వేసింది. సమయానికి పీహెచ్సీలో వైద్యులు యాంటీవీనమ్ ఇంజక్షన్ ఇవ్వగా ప్రాణాపాయం తప్పింది.

మెదక్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సుమారు నెల రోజులుగా వరుస వర్షాలు కురుస్తున్నాయి. దీంతోపాటే పాముకాటు కేసులూ పెరుగుతున్నాయి. మెదక్ జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 67 మంది పాముకాటుకు గురయ్యారు. ఒక్క వానాకాలం సీజన్‌లోనే 41 మంది పాముకాటు బారిన పడ్డారు. ఇవన్నీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రికార్డు అయిన కేసులే. ఇక ప్రైవేట్ ఆసుపత్రుల్లో, ఇతర మార్గాల్లో వైద్యం చేయించుకున్న ఘటనలు అదనం. వర్షాల కారణంగా ఇళ్లలోకి పాములు చేరడంతో పాటు రైతులు వ్యవసాయ భూములకు వెళ్తున్న క్రమంలో పాముకాటుకు గురవుతున్నాయి. వైద్యులు చెబుతున్న దాన్ని బట్టి పాముకాటు కేసులు ఎక్కువగా జూలై-సెప్టెంబరు నెలల్లోనే అధికంగా ఉంటాయి. రాత్రిపూట టార్చిలైటు లేకుండా బయటకు వెళ్లడం, వర్షం కారణంగా తడినేలపై నిర్లక్ష్యంగా నడవడం, పాడి గేదెల పాకల దగ్గర జాగ్రత్తలు తీసుకోకపోవడం తదితర కారణాల వల్ల ప్రధానంగా పాముకాటుకు గురవుతున్నారు. పాముకాటుకు గురైతే ఇంట్లో చిట్కాలు పాటించడం, మంత్రగాళ్ల వద్దకు వెళ్లడం చేయకుండా ఆస్పత్రికి తీసుకురావాలని వైద్యులు సూచిస్తున్నారు.



జాగ్రత్తలు పాటించాలి

పాముకాటు కేసులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో నమోదవుతున్నాయి. పొలాల్లో గడ్డి వాముల్లో, పాడి గేదెల పాకల్లో పాములు ఎక్కువగా ఆశ్రయం పొందుతుంటాయి. వర్షాల కారణంగా బయటకు రావడంతో ఇళ్లలోకి కూడా జొరబడుతున్నాయి. నిర్లక్ష్యంగా ఉంటే పాముకాటుకు గురయ్యే అవకాశం ఉంది. రాత్రివేళ టార్చిలైటు లేకుండా బయటకు వెళ్లరాదు. పొలాల్లో పనిచేసే సమయంలో పాదరక్షలు తప్పనిసరిగా వేసుకోవాలి. గడ్డి రాశులు, పాకలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. పిల్లలకు జాగ్రత్తలు సూచించాలి. పాముకాటు వేస్తే మంత్రాల జోలికి వెళ్లకుండా తక్షణమే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రితో పాటు అన్ని ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాలలో యాంటీవీనమ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. సమయానికి వస్తే వందశాతం ప్రాణరక్షణ సాధ్యం.

– డాక్టర్ హరిప్రసాద్, డీఎంహెచ్ఓ కార్యాలయ ఏఓ

ఎల్లాపూర్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత

పాపన్నపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మంజీరా ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని ఎల్లాపూర్ బ్రిడ్జిని తాకుతూ ప్రవహిస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. బ్రిడ్జిపై రాకపోకలు ఆపేసిన అధికారులు పాపన్నపేట వైపు టాపర్లు పెట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఏడుపాయల వనదుర్గ ఆలయం ఎదుట ప్రవాహాన్ని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పరిశీలించారు. ఘనపురం ఆనకట్టపై నుంచి భారీగా నీరు వస్తోందని, ప్రజలు లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట ఎస్సై శ్రీనివాస్ గౌడ్, పోలీసులు ఉన్నారు.


ఎల్లాపూర్ బ్రిడ్జి మూసివేస్తూ ఏర్పాటు చేసిన టాపర్లు

గాంధీ ఆస్పత్రి నుంచి రోగి సహాయకురాలి అదృశ్యం

బౌద్ధనగర్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి నుంచి రోగి సహాయరాలు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా బురుపల్లె గ్రామానికి చెందిన భూమమ్మ(50) తన కుమారుడిని కాలికి ప్లాస్టిక్ సర్జరీ నిమిత్తం పది హేనుల క్రితం గాంధీ ఆస్పత్రిలో చేర్పించింది. కుమారుడికి భూమమ్మ సహాయకురాలిగా ఉంది. సెప్టెంబరు 28వ తేదీన ఉదయం పదిన్నర గంటల సమయంలో భూమమ్మ ఎవ్వరికి చెప్పకుండా గాంధీ ఆస్పత్రి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు, బంధువులు పలుచోట్ల వెతికినా ఫలితం లేదు. దీంతో కుమార్తె గులకంట భవ్య తన తల్లి కనిపించటం లేదని మంగళవారం రాత్రి పోలీసలకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


భూమమ్మ (ఫైల్

అద్భుతం.. అమ్మ

ఓ ఉపాధ్యాయుడి చిత్రలేఖనం

మనోహరాబాద్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బ్రహ్మచారి విజయదశమి సందర్భంగా కాగితంపై దుర్గామాత చిత్రాన్ని గీశారు. రంగుల్లో గీసిన ఈ చిత్రం ఆకట్టుకుంటోంది.




(రోడ్డు ప్రమాదంలో చక్రాల కింద నలిగిన డ్రైవర్

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

తూప్రాన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): లారీ టైరు పేలడంతో దానిని మార్చేందుకు ప్రయత్నిస్తున్న డ్రైవర్‌ను మరో లారీ వేగంగా వచ్చి ఢీ కొనడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి తూప్రాన్ పట్టణ హైవే బైపాస్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న లారీ తూప్రాన్ పట్టణ శివారులో హైవే బైపాస్‌లో నర్సాపూర్ బ్రిడ్జీ వద్దకు రాగానే ముందు టైర్ పేలిపోయింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ ఎండీ నసీమ్ (40) లారీ పక్కకు నిలిపి టైర్ మార్చేందుకు జాకీ ఎక్కిస్తున్నాడు. అదే సమయంలో వెనుకగా వస్తున్న మరో కంటైనర్ లారీ వేగంగా వచ్చి నసీమ్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో నసీమ్ లారీ చక్రాల కింద ఇరుక్కుని అక్కడిక్కడే మృతి చెందాడు. ఢీకొన్న లారీ డ్రైవర్ హిమాన్షు పాల్ (24), క్లీనర్ నిర్భయ్ యాదవ్ (21)లు గాయపడ్డారు. లారీ యజమాని అస్లామ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

● ఒకరి పరిస్థితి విషమం



తీవ్ర గాయాలపాలైన శివ, రమేష్

చేగుంట, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): కారు, బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన చేగుంట మండలం ఉల్లి తిమ్మాయపల్లి గ్రామ శివారులోని కమాన్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అనంతసాగర్ గ్రామానికి చెందిన మేకల రమేష్, మేకల శివ చేగుంట నుంచి బైక్ పై అనంతసాగర్ వస్తుండగా ఇబ్రహీంపూర్ నుంచి చేగుంట వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. రమేష్‌కు తలకు గాయాలు కాగా, మేకల శివకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు చేగుంట ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి కారణమైన కారు

గుండ్రెడ్డిపల్లి అడవిలో చిరుత సంచారం


గుండుపై సేద తీరుతున్న పులి

తూప్రాన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్రెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం రేగింది. గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, దాతర్‌పల్లి గ్రామాల శివారుల్లోని అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా చిరుత కనిపిస్తున్నట్లు గ్రామస్తులు వివరించారు. బుధవారం సాయంత్రం అటవీ ప్రాంతంలో గుండుపై చిరుత సేదతీరడం చూసినట్లు తెలిపారు. గతంలో మాచిన్‌పల్లి అటవీప్రాంతంలో చిరుతను గుర్తించారు. అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు తెలియడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అయితే, గతం నుంచే ఇక్కడ చిరుత సంచారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఓం ప్రకాశ్ సూచించారు.

గుండెపోటుతో క్రికెటర్ మృతి

మెదక్ అర్బన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో యువ క్రికెటర్ మృతి చెందిన ఘటన బుధవారం మెదక్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నవాబుపేటకు చెందిన సాయికిశోర్(28)కు బుధవారం ఉదయం ఇంట్లో ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే కుప్పకూలిపోయాడు. సాయికిశోర్ జిల్లా, రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబరిచేవాడని తోటి క్రీడాకారులు పేర్కొన్నారు. మృతుని భార్య భాగ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


సాయికిశోర్(ఫైల్)

వైద్యులసమయపాలనపై ప్రత్యేక నిఘా

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

సంగారెడ్డి డీసీహెచ్ఎస్ డా. షేక్ మహ్మద్ షరీఫ్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సంగారెడ్డి అర్బన్, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది, ఉద్యోగుల విధులపై ప్రత్యేక నిఘా ఉంచామని, విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త(డీసీహెచ్ఎస్) డా.షేక్ మహ్మద్ షరీఫ్ హెచ్చరించారు. ఇటీవల డీసీహెచ్ఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న : ఏరియా, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో కొందరు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదనే విమర్శలపై ఏ విధంగా స్పందిస్తారు?

జవాబు: డ్యూటీ రోస్టర్ ప్రకారం ప్రతి డాక్టర్, వైద్య సిబ్బంది వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిబద్ధతతో పనిచేయాలి. సంతకాలు చేసి డ్యూటీ మధ్యలో వెళ్లిపోతే సహించేది లేదు. ఫిర్యాదులు రాకుండా పారదర్శకంగా అకింతభావంతో పనిచేయాలి. అక్టోబరు 1 నుంచి డాక్టర్లతో పాటు అన్ని కేడర్ల సిబ్బంది, ఉద్యోగులకు ఆధార్‌బేస్డ్ అటెండెన్స్ పక్కాగా అమలు చేస్తాం.

ప్రశ్న : రోగుల పట్ల డాక్టర్లు, సిబ్బంది అమర్యాద, దుర్భాషలాడుతున్నట్టు వస్తున్న ఆరోపణలపై మీరిచ్చే ఆదేశాలేమిటి?

జవాబు: ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల డాక్టర్లు, వైద్య సిబ్బంది స్నేహపూర్వకంగా, మర్యాదగా వ్యవహరించాలి. రోగులకు అర్థమయ్యేలా సమాధానాలు, సూచనలు, సలహాలివ్వాలి. రోగుల పట్ల అజాగ్రత్తగా వ్యవహరించొద్దు. వైద్య సేవలందించే విషయంలో ఆవేశాలు, ఆగ్రహాలు, దుర్భాషలు పనికిరావు.

ప్రశ్న: రోగులు, గర్భిణులను చిన్నాచితక కారణాలతో ఏరియా, సీహెచ్‌సీల నుంచి జిల్లా ఆస్పత్రి, హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

జవాబు: టీవీవీపీ ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది పరిధికి లోబడి పనిచేయాలి. కేసు తీవ్రతను బట్టి ఎక్కడి కేసులు అక్కడే వైద్య సేవలందించాలి. చిన్నా చితక అనారోగ్య కారణాలను పెద్దగా చూపి రెఫర్ చేయవద్దు. పరిస్థితి తీవ్రంగా ఉండి మన వద్ద కానీ పక్షంలో తప్పా అకారణంగా కేసులు రెఫర్ చేసి రోగులు, గర్భిణులను ఇబ్బందులకు గురిచెయ్యొద్దు.

ప్రశ్న : టీవీవీపీ ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది, మందుల కొరత ఉందా?

జవాబు: ప్రస్తుతానికి డాక్టర్లు, సిబ్బంది సరిపడా ఉన్నారు. లేనిచోట తాత్కాలికంగా సర్దుబాటు చేస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. కొరత ఏమీ లేదు.


అమ్మో.. పాము.!
ఈ ఏడాది ఇప్పటికే 67మందికి కాటు
వానాకాలం సీజన్‌లోనే 41 మందికి..
మంత్రాల జోలికి వెళ్లొద్దు 6లో





దసరా వేడుకలకు సర్వం సిద్ధం

- రావణ దహనానికి భారీ ఏర్పాట్లు



మెదక్ అర్బన్ / సంగారెడ్డి క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగను పురస్కరించుకుని పట్టణాలు, పల్లెలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా కొలిచే విజయదశమి పండుగను గురువారం ఘనంగా నిర్వహించేందుకు మెదక్, సంగారెడ్డి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. పండుగకు కావాల్సిన సామగ్రి, నూతన వస్త్రాల కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి నెలకొంది. దసరా రోజున వాహన పూజలు నిర్వహించి, నవరాత్రోత్సవాలలో భాగంగా దేవీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు.

రావణ దహనం కోసం..

ఏటా మాదిరిగానే విజయదశమి వేడుకలకు మెదక్ జిల్లా కేంద్రం, సంగారెడ్డి పట్టణం ముస్తాబయ్యాయి. మెదక్‌లోని జూనియర్ కళాశాల మైదానంలో, సంగారెడ్డిలోని గంజ్ మైదానంలో వేడుకలు సర్వం సిద్ధం చేశారు. రావణ దహనం కోసం భారీ రావణాసురుడి కటౌట్‌ను రూపొందించారు. మెదక్‌లో వేడుకలకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహితరావు, ఎంపీ రఘునందన్‌రావు పాల్గొననున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.


మెదక్ జూనియర్ కళాశాలలో దహనం కోసం ఏర్పాటు చేసిన దశకంఠుడి కటౌట్ (ఫైల్)











దసరాకు 'మందు' జాగ్రత్త

- ఒకరోజు ముందుగాన్షే మద్యం, మటన్ కొనుగోలు
- కిక్కిరిసిన దుకాణాలు

మెదక్/సంగారెడ్డి క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగకు చుక్క, ముక్క లేకుంటే సరదా ఏముంటుంది..! అందుకోసమే జనం 'మందు' జాగ్రత్త పడుతున్నారు. అక్టోబరు 2 గాంధీ జయంతి రోజునే దసరా రావడంతో మెదక్, సంగారెడ్డి జిల్లాలో మటన్, మద్యం దుకాణాలు మూసివేయనున్నారు. దీంతో ప్రజలు బుధవారం సాయంత్రం నుంచే మటన్, మద్యం దుకాణాల ముందు బారులు తీరారు. మరోవైపు పాత మద్యం పాలసీ నవంబరు 30న ముగుస్తుండటంతో చివరి రోజుల్లో మద్యం ఎక్కువ విక్రయాలపై వ్యాపారులు ఫోకస్ పెట్టారు. దీంతో మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మస్తుగా అమ్మకాలు పెరిగాయి. బుధవారం మద్యం దుకాణాల వద్ద భారీ బారులు తీరి కొనుగోలు చేశారు.

మెదక్‌లో రూ. 3 కోట్ల అధికంగా..

మెదక్ జిల్లాలో గతేడాది కంటే ఈసారి దసరా సందర్భంగా ఎక్కువ విక్రయాలు జరిగాయి. గతేడాది జిల్లా వ్యాప్తంగా 118 వైన్స్‌లు, 16 బార్‌లలో రూ.9.5 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు కొల్చారం మండలం చిన్న ఘనపురంలోని ఐఎంఎల్ డిపో అధికారులు తెలిపారు. ఈ ఏడాది మొత్తం 13.49 కోట్ల విలువైన మద్యం ఐఎంఎల్ డిపో నుంచి తరలింది. గతేడాది 15,769 బీరు కేసులు విక్రయించారు. వాటి విలువ రూ. 2.63 కోట్లు, అదే విధంగా 9,527 మద్యం కేసులు విక్రయించగా, వాటి విలువ రూ. 6.87 కోట్లు మొత్తంగా రూ.9.5 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది దసరా వేడుకలకు 14,548 ఐఎంఎల్ మద్యం కేసులు (ధర రూ. 11.41కోట్లు), 15,769 బీరు కేసులు(ధర రూ.2.08 కోట్లు) తరలించారు. మొత్తంగా రూ.13.49 కోట్ల విలువైన మద్యాన్ని తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇక మెదక్ పట్టణంలో ఒక్కో కస్టమర్ రూ. 2 వేల నుంచి రూ.5 వేల వరకూ వెచ్చించి మద్యం కొనుగోలు చేశారు. ప్రత్యేక బ్రాండ్లు, బీరు కేసులు మందే అవుట్ ఆఫ్ స్టాక్ అయ్యాయి. కొందరికి పండగ బోనస్, జీతాలు రావడంతో ఉద్యోగులు, కార్మికులు ఉత్సాహంగా మద్యం కొనుగోలు చేసుకున్నారు. ఈ మూడు రోజుల్లోనే గత నెల రోజుల సేల్స్ దాటేశామని ఓ వైన్స్ షాపు నిర్వాహకుడు తెలిపారు.


మెదక్ పట్టణంలోని వైన్స్‌షాపులో మద్యం అమ్మకాలు



సంగారెడ్డి పట్టణంలో..

రూ.50వేలు దాటొద్దు

- ఎన్నిక కోడ్‌లపై పోలీసుల నజర్
- అక్రమ నగదు సరఫరాపై నిఘా
- మొదలైన వాహన తనిఖీలు
- పరిమితి మించి నగదు పట్టుబడితే సీజ్
- పెళ్లిళ్ల సీజన్‌లో తప్పని ఇబ్బందులు
- సరైన ఆధారాలు, పత్రాలుంటే ఒకే

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చింది. ఈంతో జిల్లావ్యాప్తంగా గుర్తించిన ప్రాంతాల్లో వాహన తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు.

నగదు రవాణాపై నిబంధనలు

ఎన్నికల కోడ్ ముగిసేవరకు ఒక వ్యక్తి రూ.50 వేలకు వరకు మాత్రమే నగదును వెంట తీసుకెళ్లడానికి ఎన్నికల కమిషన్ అనుమతిస్తుంది. ఈ పరిమితిని మించి ఒక్క రూపాయి ఎక్కువ నగదు రవాణా చేసినా, దానికి సంబంధించిన సరైన పత్రాలు లేకపోతే అధికారులు ఆ మొత్తాన్ని సీజ్ చేస్తారు. ఎక్కువ మొత్తంలో నగదు దొరికితే, ఎన్నికల అధికారులు ఆ సమాచారాన్ని ఆదాయపు పన్ను, జీఎస్టీ అధికారులకు అందించి, ఆ నగదును కోర్టులో డిపాజిట్ చేస్తారు. తక్కువ మొత్తంలో పట్టుబడిన డబ్బును అధికారుల వద్ద జమ చేస్తారు. ప్రజలు అనవసర ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నగదు రవాణా చేస్తే తప్పనిసరిగా సరైన ఆధారాలను తమ వెంట ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో ఇబ్బందులు

అక్టోబరు నెలాఖరు నుంచి పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుండటంతో, దుస్తులు, బంగారం, ఇతర వస్తువుల కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉంది. అలాగే, ఫంక్షన్ హాళ్ల యజమానులకు అడ్వాన్సులు చెల్లించాల్సి ఉంటుంది. సంగారెడ్డి జిల్లా హైదరాబాద్ నగరానికి చేరువలో ఉండటంతో కొనుగోళ్ల కోసం చాలా మంది నగరానికి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో సరిపడా నగదును వెంట తీసుకెళ్లేందుకు

-మిగతా 9 వ పేజీలో



అధికారులతో సమావేశమైన ఎస్పీ

పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలకు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పోలీసు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తమ పరిధిలోని అన్ని పోలింగ్ లోకేషన్లు, పోలింగ్ స్టేషన్లను తప్పనిసరిగా సందర్శించి, పోలింగ్ రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికలను ప్రభావితం చేసే డబ్బు, మద్యం లేదా ఇతర అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ, హింసాత్మక సంఘటనలు జరగకుండా చూడాలన్నారు ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు నమోదు చేయాలని సూచించారు.



నేడు మాంసం దుకాణాలు మూసి ఉంచాలి

నారాయణఖేడ్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గాంధీజయంతిని పుర స్కరించుకొని ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం మాంసం దుకాణాలను మూసి ఉంచాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. ఈ మేరకు నోటీసులను బుధవారం శానిటేషన్ అధికారితో కలిసి మాంసం దుకాణాదారులకు అందజేశారు.

కంగ్టి మండలంలో నలుగురికి ఎంబీబీఎస్‌లో సీట్లు



బల్‌బీంరావు, సిద్ధ రమేష్, చెనిగెపల్లి హర్షిణి, ర్యాకల జ్యోతి

కంగ్టి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కంగ్టి మండలంలో నలుగురు విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు దక్కించుకొని అందరి మన్ననలు పొందారు. జాతీయ స్థాయిలో జరిగిన నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించడంతో ముగ్గురికి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్లు దక్కగా ఒకరికి ప్రైవేటు కళాశాలలో సీటు లభించింది. వీరిలో కంగ్టికి చెందిన పోలీస్ పాటిల్ బల్‌బీంరావుకు వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, గరిడేగాం సిద్దరమేష్‌కు నారాయణపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, తుర్కవడగాంకు చెందిన చెనిగేపల్లి హర్షిణికి వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో సీటు దక్కింది. కాగా దెగుల్‌వాడికి చెందిన ర్యాకల జ్యోతికి చేవేళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి కళాశాలలో సీటు లభించింది. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీట్ ఆఫీసర్ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా...



సింధూజ

నర్సాపూర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ అటవీశాఖ పరిధిలో బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సింధూజ గ్రూపు-2లో ఎంపికయ్యారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం చల్మడ గ్రామానికి చెందిన సిందుజ కొంతకాలంగా నర్సాపూర్ అటవీశాఖలో బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూనే, మరోవైపు గ్రూపు-2కు ప్రిపేర్ అయి ఉద్యోగం సాధించింది. తల్లిదండ్రులు, భర్త తోడ్పాటుతో పాటు తోటి సిబ్బంది, అధికారుల ప్రోత్సాహం వల్లే తాను ఈ ఉద్యోగం సాధించగలిగానని ఆమె పేర్కొన్నారు. గ్రూపు-2లో సిందుజ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా నియామకమైంది.

అభివృద్ధికి నిధులు కేటాయించండి


జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్ అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు కేటాయించాలని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్ కోరారు. ఈ మేరకు బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాయినగర్ కాలనీలోని థీమ్‌పార్కులో టాయ్‌లెట్స్, కమ్యూనిటీహాలు నిర్మాణానికి రూ.25లక్షలు, కాకతీయనగర్‌లో సీసీరోడ్డుకు రూ.44లక్షలు, మయూరినగర్,అశోక్‌నగర్, వినాయకనగర్ కాలనీల్లో సీసీరోడ్లు నిర్మించేందుకు రూ.65.53 లక్షలు కేటాయించాలని కోరారు.

స్టోన్ క్రషర్ పనుల నిలిపివేతకు హైకోర్టు ఉత్తర్వులు

జిన్నారం అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం రాళ్లకత్వలో చేపట్టిన స్టోన్ క్రషర్ పనులను నిలిపి వేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు నాయకులు ఆదిరామకృష్ణ తెలిపారు. రాళ్లకత్వ 286సర్వే నంబరులో చేపట్టిన స్టోన్ క్రషర్ పనులపై స్థానికులు కోర్టులో ఫిర్యాదు చేయగా.. బుధవారం ఆయా పనులను నిలిపి వేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు కాపీలను క్రషర్ యాజమాన్యంతో పాటు జిన్నారం సీఐకు కూడా అందజేసినట్లు గ్రామ నాయకులు తెలిపారు.

సమన్వయంతో పని చేయాలి

కంగ్టి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచు ఎన్నికలు సజావుగా కొనసాగించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని కంగ్టి సీఐ వెంకటరెడ్డి, ఎంపీడీవో సత్తయ్యలు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. కోడ్ అమలులో ఉన్నందున అన్ని పార్టీలు ఎన్నికల నియమావళి పాటించేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ భాస్కర్, ఎంపీవో లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడి బోధనలను అనుసరణీయం

జహీరాబాద్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): విశ్వ గురువు బసవేశ్వరుడి బోధనలు అందరికి అనుసరణీయమని వెంకటేశ్వర యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్లు జయరాం, కిషన్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బసవకల్యాన్‌కు వెళ్తున్న వారిని బుధవారం పట్టణంలోని బసవమండపంలో లింగాయత్ సమాజ్‌నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ నాయకులు పాల్గొన్నారు.


తూప్రాన్‌లో సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళల ఆటపాటలు




వెల్దుర్తి : హస్తాల్‌పూర్‌లో బతుకమ్మ సందడి

సద్దుల సంబురం

మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రధాన కూడళ్లు, ఆలయాల ఆవరణలో బతుకమ్మలను ఉంచి ఆటపాటలతో సందడి చేసి చెరువుల్లో నిమజ్జనం చేశారు. తూప్రాన్ పట్టణంలో మహంకాళి ఆలయం, జెండా వద్ద బతుకమ్మ ఆటలు ఆడి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఏర్పాట్లు చేశారు. పెద్ద చెరువు కట్ట వద్ద లైటింగ్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. అలాగే వెల్దుర్తి, మనోహరాబాద్, నిజాంపేట, మాసాయిపేట మండలాల్లోని ఆయా గ్రామాల్లో సద్దుల బతుకమ్మ పండుగను ఉత్సాహంగా జరుపుకుని సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. పలు చోట్ల డీజే పాటల మధ్య మహిళలు, యువతులు బతుకమ్మ ఆడారు.

- న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి)


నిజాంపేటలలో బతుకమ్మ ఆడుకున్న మహిళలు


మనోహరాబాద్ మండలంలోని గౌతోజీగూడెంలో..

మహిషాసుర మర్దినిగా అమ్మవారు


ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో..


చిన్నశంకరంపేట మండలంలోని కొర్విపల్లిలో..


రేగోడులో మహిషాసురమర్దినిగా గజవాడ దుర్గాదేవి..


మహిషాసుర మర్దినిగా ఏడుపాయల దుర్గమ్మ

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుపుకుంటున్నారు. మండపాలు, ఆలయాల ఆవరణలో నెలకొల్పిన అమ్మవారిని రోజుకో అలంకరణలో భక్తులు దర్శించుకుంటున్నారు. ఇందులో భాగంగా బుధవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలుచోట్ల హోమాలు, అభిషేకాలు, అన్న ప్రసాదవితరణ కార్యక్రమాలు నిర్వహించగా, మరికొన్ని మండపాల వద్ద కుంకుమార్చనలు పెద్దఎత్తున నిర్వహించారు.

- న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి)


పాపన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

సంస్కృతి పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

పెద్దశంకరంపేట/పాపన్నపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆర్‌ఎస్‌ఎస్ మెదక్ విభాగ్ సహ కార్యవాహ బి.నర్సింలు పేర్కొన్నారు. పెద్దశంకరంపేటలో టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన విజయదశమి ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఆర్‌ఎస్‌ఎస్ సాధించిన విజయాలు తదితర విషయాలను వివరించారు. పంచ పరివర్తనలో భాగంగా కుటుంబ ప్రబోధన్ సామాజిక సమరసత స్వదేశీ పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు అంశాలపై ఆయన వివరించారు. పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సాన్పల్లిలో శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ తోట రవి మాట్లాడుతూ.. దేశ సేవలో స్వయంసేవకుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో ఖండ వ్యవస్థాపక్ ప్రముఖ్ బోలాశేఖర్, జిల్లా గ్రామీణ వికాస్ ప్రముఖ్ క్రిష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి: బీజేపీ

పాపన్నపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు గెలుచుకొని సత్తా చాటాలని పార్టీ శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలం మండలంలోని నార్సింగి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు వడ్ల సంతోష్ చారి ఆధ్వర్యంలో బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశానికి మల్లేష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో బీజేపీ అన్ని స్థానాలలో అభ్యర్థులను పోటీకి నిలబెడుతుందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలకు, 40 సర్పంచ్ స్థానాలకు, వార్డు మెంబర్, జడ్పీటీసీ స్థానాల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. బీజేపీలో చేరిన పలువురికి జిల్లా పార్టీ అధ్యక్షుడు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రూ.50వేలు దాటొద్దు

(7వ పేజీ తరువాయి)

ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

సరైన పత్రాలుంటే సరి..

వైద్యం, కళాశాల ఫీజులు, పెళ్లిళ్ల వంటి అత్యవసర అవసరాల కోసం అధిక మొత్తం నగదు తీసుకెళ్లాల్సి వస్తే దానికి సంబంధిత ఆధారాలు వెంట ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. బ్యాంకు లావాదేవీల్లో నగదు డ్రా చేసినట్లయితే అకౌంట్ పుస్తకం లేదా ఏటీఎం రసీదు (చీటీ), వ్యాపార లావాదేవీల్లో వస్తువులు, ధాన్యం విక్రయించిన డబ్బు అయితే దాని బిల్లులు చూపించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఆస్తి లావాదేవీల్లో భూమి విక్రయించిన సొమ్ము అయితే దానికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఇతర సేవల ద్వారా వచ్చిన డబ్బు అయితే లావాదేవీల పూర్తి వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరు మృతి


గాయపడిన లక్ష్మణ్

అల్లాదుర్గం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. బుధవారం అల్లాదుర్గం ఎస్‌ఐ శంకర్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్కల్ మండలం పోచారం గ్రామానికి చెందిన నాగరాపు లక్ష్మణ్ (38) గత 14ఏళ్ల క్రితం అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామానికి మల్లీశ్వరి వివాహం చేసుకొని ఇల్లరికం అల్లుడిగా వచ్చాడు. లక్ష్మణ్ మద్యానికి బానిసై గత కొంత కాలంగా భార్యతో దూరంగా ఉంటున్నాడు. మంగళవారం లక్ష్మణ్ గ్రామానికి వచ్చి ఇదే గ్రామానికి చెందిన పుట్టి అంజయ్యలు కలసి మద్యం సేవించారు. మద్యం మత్తులో వారి మధ్య మాటలు పెరిగి ఘర్షణ జరిగింది. దీంతో లక్ష్మణ్ తల, చేతిపై అంజయ్య విచక్షణా రహితంగా దాడిచేసి గాయపర్చాడు. అతడిని 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు ఎస్.ఐ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రమేష్(ఫైల్)

చిన్నశంకరంపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని శాలిపేట గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ నారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం అంబాజీపేట గ్రామ బస్టాండ్ సమీపం మెదక్-చేగుంట రహదారిపై కారు బైకు ఢీకొన్న ఘటనలో గ్రామానికి చెందిన బుస్స రమేష్ (45)కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య యశోద, ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

పటాన్‌చెరు అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లు కాంపౌండ్‌లో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. బుధవారం ఏఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలోని కల్లుకాంపౌండ్‌లో 55 ఏళ్ల గుర్తుతెలియని మృతదేహం పడి ఉంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నారు.

గుండెపోటుతో స్వీపర్ మృతి


నర్సింహులు(ఫైల్)

పాపన్నపేట అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వన దుర్గామాత ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న బైండ్ల నరసింహులు(50) బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించాడు. కొల్చారం మండలం కొంగల ఘనపూర్‌కు చెందిన నర్సింహులు గత కొన్నేళ్లుగా ఆలయంలో విధులు నిర్వర్తిస్తూ సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నాడు. అతడి మృతి తమకెంతో బాధ కలిగించిందని ఏడుపాయల ఈవో సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరారం గ్రామంలో బుధవారం ఓ వ్యక్తికి విద్యుత్‌షాక్‌తో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మల్లుపల్లికి చెందిన అరికల పోచయ్య పొలానికి నీరు పెట్టేందుకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

● డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు సోపానాలని ఆ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులో మాట్లాడుతూ .. బీఆర్‌ఎస్ రోజురోజుకూ తన ఉనికిని కోల్పోతుండగా. బీజేపీకి స్థానిక ఎన్నికల్లో గెలిచే సత్తా లేదన్నారు.